నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 ఖమ్మం, గురువారం 13 ఫిబ్రవరి 2025 KHAMMAM

# ఎన్నికల మార్గదర్శకాలు పాటించాల్సిందే..

## శిక్షకులకు దిశానిర్దేశం చేసిన అదనపు కలెక్టర్ వేణుగోపాల్



శిక్షణలో పాల్గొన్న అదనపు కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతీ అధికారి మార్గదర్శకాలు తప్పక పాటించాల్సిందేనని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి నోడల్ అధికారులు, ఆర్వో, ఏఆర్వోలకు బుధవారం నిర్వహించిన శిక్షణకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నోడల్ అధికారులుగా ఉన్న డిప్యూటీ సీఈవో చంద్రశేఖర్, ఎంప్లాయ్‌మెంట్ అధికారి శ్రీరాం అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు నామినేషన్ల స్వీకరణ, నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతీ బాధ్యత ఆర్వో, ఏఆర్వోలపైనే ఉంటుందన్నారు. పోలింగ్ సమయంతోపాటు నామినేషన్ల స్వీకరణ సమయం కచ్చితంగా పాటించాలన్నారు. జిల్లాలోని 22 మండలాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారని, ఇప్పటికే ఓటర్ల జాబితా సిద్ధం చేశారన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి ఎలాంటి సెలవులు ఉండవని, కొందరు రిజర్వులో ఉన్నా వారు కూడా అందుబాటులో ఉండాల్సిందేనన్నారు. ఎన్నికల విధులకు సంబంధించి నిబంధనలు పాటించకపోతే చర్యలు కూడా అదే స్థాయిలో ఉంటాయన్నారు. శిక్షణలో ఆర్వోలు, ఏఆర్వోలు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన అధికారులు

- మొక్కజొన్న రైతులను ముంచిన విత్తన కంపెనీలు
- 'పేట'లో 600 ఎకరాల్లో సాగు ప్రయోగం విఫలం
- టన్నుకు రూ.30 వేల హామీ.. రూ.1.20 కోట్ల నష్టం..
- అగ్రిమెంట్ బాండ్లు ఇవ్వకుండా సాగు ప్రోత్సాహం
- ఎకరాకు 3-6 టన్నుల దిగుబడి అంటూ ప్రచారం
- కానరాని పంట కాపు.. దిగుబడి నిరాశాజనకం..
- మొక్కజొన్న రైతుల ఆరుగాలం శ్రమ ఆవిరి..
- మొహం చాటేస్తున్న కంపెనీల విత్తన కంపెనీల ఏజెంట్లు



ఏపుగా పెరిగిన మొక్కజొన్న తోట



# సీడ్ మాయాజాలం

అశ్వారావుపేట, ఫిబ్రవరి 12 : 'సీడ్ విత్తనం' పేరిట విత్తన కంపెనీలు మాయాజాలం చేశాయి. మొక్కజొన్న రైతులను నిండా ముంచాయి. ఎకరాకు 3 నుంచి 6 టన్నుల వరకు దిగుబడి వస్తుందంటూ ప్రచార ఆర్భాటాలతో మభ్యపెట్టిన కంపెనీల ఏజెంట్లు.. ఇప్పుడు మాట మార్చుతున్నారు. అశ్వారావుపేట మండలవ్యాప్తంగా 600 ఎకరాల్లో సీడ్ విత్తనం సాగు ప్రయోగం విఫలమైంది. దీంతో రైతులు రూ.1.20 కోట్ల మేరకు నష్టపోయారు. బాండ్లు ఇవ్వకుండా పెట్టుబడి సాకుతో కంపెనీ ఏజెంట్లు నిలువునా మోసం చేశారు. వాస్తవంగా ఏజెంట్ల ప్రమేయం లేకున్నా కంపెనీలు మధ్యవర్తిగా వీరినే రైతుల వద్దకు పంపుతున్నాయి. టన్నుకు రూ.30 వేలు ధర చెల్లిస్తామని చెబుతున్నప్పటికీ నిరాశాజనకమైన దిగుబడే వస్తోంది. దీంతో అసలు పెట్టుబడి రాకపోగా.. రూ.20 వేల చొప్పున రైతులు నష్టపోతున్నారు. పంట కాలపరిమితి పూర్తవుతున్నప్పటికీ కాపు కనిపించక.. దిగుబడి ఆశాజనకంగా లేక మొక్కజొన్న రైతులు దిగాలు చెందుతున్నారు. వ్యవసాయ శాఖ పర్యవేక్షణ లోపం; కంపెనీలు, ఏజెంట్ల మోసం.. వెరసి రైతులకు శాపంగా మారాయి.

అశ్వారావుపేట మండలంలో మొక్కజొన్న విత్తన కంపెనీల ప్రయోగం బెడిసికొట్టింది. ఫలితంగా సాగు చేసిన రైతులే ఆర్థికంగా నష్టపోతున్నారు. మధ్యలో కంపెనీలు, ఏజెంట్లు లాభపడుతుండగా.. మరి వ్యవసాయ శాఖ అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నకు సమాధానం లభించడం లేదు. కొన్ని విత్తన కంపెనీలు విత్తన ఉత్పత్తి కోసం దిగుబడి, ధరలపై రైతులకు భరోసా కల్పించి సాగును ప్రోత్సహిస్తున్నాయి. ఇలా మండలంలోని నారాయణపురం, గాండ్లగూడెం, అనంతారం వంటి గ్రామాల్లో రెండు ప్రముఖ మొక్కజొన్న కంపెనీలు రైతుల ద్వారా మూడు రకాల సీడ్ మొక్కజొన్న సాగు చేపట్టాయి. సాగు చేసినందుకుగాను కంపెనీ విత్తనాలను బట్టి ఎకరాకు 3 నుంచి 6 టన్నులు దిగుబడి వస్తుందని ఏజెంట్లు రైతులకు గ్యారెంటీ ఇచ్చారు. టన్ను ధర రూ.30 వేలు చెల్లిస్తామని హామీ కూడా ఇచ్చారు. కానీ.. పంట కాలపరిమితి పూర్తవుతున్నప్పటికీ కనీసం ఒక టన్ను దిగుబడి కూడా రావట్లేదు. ఫలితంగా రైతులకు అసలు పెట్టుబడి సహా అంతా నష్టపోవాల్సి వస్తోంది. దీనికి తోడు రైతుల ఆరుగాలం శ్రమ కూడా ఆవిరైపోతోంది. మండలంలో సుమారు 600 ఎకరాల్లో సీడ్ మొక్కజొన్న సాగవుతున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

### ఎకరాకు రూ.20 వేలకు పైగా నష్టం..

విత్తన కంపెనీల హామీతో ఆశపడి సీడ్ సాగు చేస్తున్న రైతులు చివరికి ఒక్కో ఎకరానికి రూ.20 వేలకు పైగా నష్టం ఎదుర్కొన్నారు. దుక్కులకు రూ.5 వేలు, కూలీలకు రూ.5 వేలు, కౌలు రూ.20 వేలు, ఎరువులు రూ.15 వేలు, పురుగు మందులు రూ.15 వేల చొప్పున సాగుకు రైతులు ఎకరానికి రూ.60 వేల నుంచి రూ.65 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. 3 నుంచి 4 టన్నుల దిగుబడి వస్తుందని కంపెనీ గ్యారెంటీ ఇచ్చింది. కానీ.. చందా కుమారస్వామి అనే రైతుకు ఒకటిన్నర టన్ను మాత్రమే దిగుబడి వచ్చింది. ఈ లెక్కన కంపెనీ ధర రూ.30 వేల ప్రకారం ఆ రైతుకు రూ.45 వేలు మాత్రమే ఆదాయం వస్తుంది. కానీ.. అప్పటికే ఆ రైతు అదనంగా రూ.20 వేలు పెట్టుబడి పెట్టాడు. ఈ నష్టం రైతు భరించాల్సి వస్తోంది. అలాగే సుమారు 120 రోజులపాటు సాగు కోసం చేసిన శ్రమ ఏజెంట్ల దోపిడీతో ఆవిరైపోతోంది. వ్యవసాయాధికారుల అంచనా మేరకు 600 ఎకరాల్లో రూ.1.20 కోట్ల మేర రైతులు నష్టపోయారు.

### సీడ్ మొక్కజొన్న అంటే..

అధిక ఉత్పత్తి సాధించే దశగా మొక్కజొన్న విత్తన కంపెనీలు ప్రయోగాలు చేస్తుంటాయి. ఇందుకు కొత్త వంగడాలను ప్రయోగాత్మకంగా రైతుల ద్వారా సాగు చేయిస్తుంటాయి. కొత్త వండగాల సాగుపై నమ్మకం లేని రైతులు నిరాకరిస్తారు. వారిని ఒప్పించేందుకు కంపెనీలు ఎకరాకు ఇంత దిగుబడి వస్తుందని, టన్ను కనీస ధరగా ఫలానా మొత్తం చెల్లిస్తామని స్పష్టంగా హామీ ఇస్తుంటాయి. ఇందుకోసం రైతులతో ఒప్పందాలు(అగ్రిమెంట్లు) చేసుకుంటాయి. ఆ అగ్రిమెంట్ బాండ్లను రైతులకు అందిస్తాయి. కానీ.. కొన్ని కంపెనీలు మాత్రం ఏజెంట్లను మధ్యవర్తిగా నియమించుకొని ప్రయోగాలు చేస్తాయి. అలాంటి కంపెనీల ఏజెంట్లకు రైతులతో ఎటువంటి సంబంధం లేకున్నా రైతులను మభ్యపెట్టి కంపెనీల తరపున పూర్తి గ్యారెంటీ ఇస్తారు. అగ్రిమెంట్లు మాత్రం రైతులకు ఇవ్వరు. కంపెనీ నుంచి తీసుకున్న అగ్రిమెంట్లను ఏజెంట్లు తమ వద్దనే ఉంచుతారు. ప్రయోగం విఫలమైనా కంపెనీల నుంచి లాభం పొందుతుంటారు.

### కమిషనర్ నుంచే అనుమతి..

విత్తన కంపెనీలు వ్యవసాయ శాఖ కమిషనర్ నుంచే విత్తన ఉత్పత్తికి అనుమతి తీసుకుంటాయి. కంపెనీలు మండలస్థాయి అధికారికి సమాచారం ఇచ్చిన తర్వాతే రైతులకు విత్తనాలు అందించాలి. కానీ.. ఇవేమీ లేకుండానే కంపెనీలు ఏజెంట్లను రంగంలోకి దింపి అనధికారికంగా విత్తన సాగు చేస్తున్నాయి. ఒకవేళ ప్రయోగం విఫలమైనా కంపెనీ నేరుగా బాధ్యత వహించదు. ఏజెంట్లు కూడా రైతులకు అగ్రిమెంట్లు ఇవ్వరు కాబట్టి రైతులు ప్రశ్నించే హక్కులు కోల్పోతున్నారు. రైతుల సమన్వయం లేకపోవడం; కంపెనీలు, ఏజెంట్లు సమాచారం ఇవ్వకపోవడం వంటి కారణాలతో మండల వ్యవసాయాధికారులు కూడా ఏమీ చేయలేకపోతున్నారు. అగ్రిమెంట్లు తీసుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నా ప్రయోజనం కనిపించడం లేదు. ఏజెంట్లు ముందుగానే పెట్టుబడి సాయం ఇస్తుండడంతో రైతులు కూడా అగ్రిమెంట్లను అడగడం లేదు. అంతిమంగా రైతులే నష్టపోతున్నారు.

### టన్ను దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు..



నాకు ఇచ్చిన విత్తనం ఎకరాకు 5 టన్నుల దిగుబడి వస్తుందని ఏజెంట్ హామీ ఇచ్చాడు. టన్ను ధర రూ.30 వేలు చెల్లిస్తానని చెప్పాడు. పంట కాలపరిమితి పూర్తవుతోంది. ఎకరాకు కనీసం టన్ను దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. కంపెనీ గ్యారెంటీ ప్రకారం ఎకరాకు ఆదాయం రూ.1.50 లక్షలు రావాలి. కానీ.. రూ.30 వేలు కూడా వస్తుందనే నమ్మకం లేదు. అయితే అగ్రిమెంట్ అవసరం లేదని, కాటా వద్దే తూకం వేసి నగదు చెల్లిస్తానని ఏజెంట్ నమ్మబలికాడు. రూ.20 వేల నగదు, పురుగు మందులు, ఎరువులు ఇచ్చారు. ఏజెంట్ వల్ల మోసపోయాను.

**–తుమ్మల మణికంఠ, రైతు, నారాయణపురం**

### కంపెనీలు సమాచారం ఇవ్వడం లేదు..



కమిషనర్ నుంచి తీసుకున్న అనుమతితోపాటు ఏ రైతులతో ఎంత విస్తీర్ణంలో విత్తన సాగు చేయిస్తున్నారోనన్న సమాచారం ఇవ్వాలని కంపెనీలు, ఏజెంట్లను అడిగాము. అయినా అటు నుంచి స్పందన రావడం లేదు. వ్యవసాయ శాఖకు సమాచారం ఇచ్చిన తర్వాతే రైతులకు సీడ్ సరఫరా చేయాలని, రైతులకు కూడా కంపెనీల నుంచి అగ్రిమెంట్లు తీసుకోవాలని మరీమరీ చెబుతున్నాం. పంట పెట్టుబడి ఆశతో రైతులు కూడా ఏజెంట్లను అగ్రిమెంట్లు అడగడం లేదు. రైతుల వద్ద అగ్రిమెంట్ లేకపోతే నష్టం వచ్చినప్పుడు ఏమీ చేయలేం.

**–పొలిమేర శివరాంప్రసాద్, ఏవో, అశ్వారావుపేట**

# ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

## భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, ఫిబ్రవరి 12 : నిరుద్యోగ గిరిజన యువతీ యువకులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీలో నిరుద్యోగ గిరిజన యువతీ యువకులకు వివిధ స్వయం ఉపాధి పథకాలపై బుధవారం నిర్వహించిన కౌన్సిలింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలానికి అనుగుణంగా యువతీ యువకులు వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. పీజీ, బీటెక్ చదివిన యువత స్కిల్ డెవలప్‌మెంట్ పెంపొందించుకొని ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. ఐటీడీఏ భవిత సెల్ ద్వారా నిర్వహించే వృత్తి శిక్షణలో తర్ఫీదు పొంది స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం జాబ్‌మేళాలో 80 మంది దరఖాస్తు చేసుకోగా.. 39 మందికి వివిధ ప్రైవేటురంగ సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభించాయి. కార్యక్రమంలో పీవో జనరల్ డేవిడ్ రాజు, జేడీఎం హరికృష్ణ, వివిధ ప్రైవేటు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

### మ్యూజియం అభివృద్ధి పనుల పరిశీలన

ఐటీడీఏ ప్రాంగణంలో ముస్తాబు చేస్తున్న గిరిజన సాంస్కృతిక మ్యూజియం అభివృద్ధి పనులను పీవో బి.రాహుల్ మ్యూజియం కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోటింగ్ ప్రదేశంలో సేఫ్టీగా కాంపౌండ్ వాల్ నిర్మించాలని, మంచెపై వెదురుతో తయారు చేసిన డైనింగ్ టేబుల్ కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ చంద్రశేఖర్, ఉద్యానవన అధికారి ఉదయ్‌కుమార్, డీఈ హరీశ్, టీఏ శ్రీనివాస్, మ్యూజియం ఇన్‌చార్జి వీరస్వామి పాల్గొన్నారు.

# మిర్చికి రూ.వెయ్యి బోనస్ ఇవ్వాలి

- మార్కెట్‌లో వ్యాపారుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని డిమాండ్
- ఖమ్మం ఏఎంసీ ఎదుట అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతు సంఘం రాష్ట్ర బృందం

రఘునాథపాలెం, ఫిబ్రవరి 12 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం క్వింటా మిర్చికి రూ.వెయ్యి చొప్పున బోనస్ ఇవ్వాలని, మిర్చి క్వింటాకు రూ.35 వేలు మద్దతు ధర నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెచ్చల రంగయ్య, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యలు డిమాండ్ చేశారు. వందలాది మంది రైతులతో కలిసి ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను బుధవారం సందర్శించిన సంఘం రాష్ట్ర బృందం గేటు ఎదుట ఆందోళన నిర్వహించింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కెచ్చల రంగయ్య, ఉప్పల ప్రభాకర్ మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పంట పండించి మార్కెట్‌లో విక్రయించేందుకు వస్తే ఖరీదుదారులు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. రైతులు మిర్చి అమ్ముకోగా వచ్చిన డబ్బులపై రూ.2 చట్టబద్ధంగా చెల్లించాల్సి ఉండగా.. 4 నుంచి 7 శాతం తీసుకుంటున్నారని ఆరోపించారు. సరుకు ఖరీదు చేసిన ధరకు కాకుండా కాటా సమయంలో కొర్రీలు పెట్టి రూ.400 నుంచి రూ.700 వరకు ధర తగ్గిస్తున్నారని ఆరోపించారు. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచుకునే రైతుల పంట ఉత్పత్తులకు రూ.5 లక్షల వడ్డీలేని రుణం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం మార్కెట్ చైర్మన్, కార్యదర్శులతో చర్చించి రైతుల సమస్యలను విన్నవించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య, చంద్ర అరుణ, కోలేటి నాగేశ్వరరావు, పాశం అప్పారావు, కేలోతు లక్ష్మణ్, జిల్లా నాయకులు కుర్ర వెంకన్న, దరావత్ లక్ష్మణ్, గుగులోతు తేజ, వడ్డే వెంకటేశ్వర్లు, బందెల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.


# కులగణన సర్వే తప్పుల తడక

- బీఆర్ఎస్ ముందే చెప్పింది..
- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, ఫిబ్రవరి 12 : కులగణన సర్వే అశాస్త్రీయంగా జరిగిందని, తప్పులతడకగా ఉందని బీఆర్ఎస్ పార్టీ లెక్కలతో సహా నిరూపించడంతో రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చి రీసర్వేకు అంగీకరించడాన్ని ఆ పార్టీ పార్లమెంటరీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర స్వాగతించారు. ఈసారైనా ఎన్యూమరేటర్స్ ఇంటింటికీ వెళ్లి పూర్తి వివరాలు సేకరించాలని, వాటన్నింటిని క్రోడీకరించి సరైన లెక్కలు వెల్లడించాలని బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓబీసీలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు కల్పించడంతోపాటు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ మొదటి నుంచి డిమాండ్ చేస్తున్నదని గుర్తుచేశారు. బీఆర్ఎస్ చేసిన తీర్మానానికి అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు తీసుకెళ్లి చట్టసభల్లో 33శాతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటులో ఆమోదింపజేసేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించాలని కోరారు. ఓబీసీల సమగ్రాభివృద్ధికి కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని ప్రధానికి విజ్ఞప్తి చేయాలని సూచించారు. మంత్రి మండలిలో ఖాళీగా ఉన్న ఆరు స్థానాల్లో నాలుగింటిని బీసీలకిచ్చి ప్రాధాన్యతశాఖలు కేటాయించాలని కాంగ్రెస్‌ను డిమాండ్ చేశారు.




### 45 రోజులైనా డబ్బులు రాలే..



సన్న వడ్లు పండిస్తే బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడంతో పంట సాగు చేశాను. కొనుగోలు కేంద్రంలో 150 క్వింటాళ్ల ధాన్యం విక్రయించాను. బోనస్ వస్తే పెట్టుబడులు తీరుతాయనుకుంటే ఇంతవరకు ఖాతాలో బోనస్ జమ కాలేదు. ధాన్యం అమ్మి 45 రోజులకు పైగా కావొస్తున్న బోనస్ మాత్రం రాలేదు. రోజూ బ్యాంకుకు వెళ్లి బ్యాలెన్స్ చూసుకుంటున్నా. ఎప్పుడు బోనస్ డబ్బులు పడతాయో అర్థం కావడం లేదు. అధికారులను అడిగితే వస్తాయిలే అని చెబుతున్నారు. నేను విక్రయించిన ధాన్యానికి బోనస్ డబ్బులు వచ్చేలా చూడాలి.

**–వీరబోయిన రాములు, రైతు, మర్రిగూడెం, అన్నపురెడ్డిపల్లి మండలం**

**సన్న వడ్లు పండిస్తే రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నమ్మించింది. తీరా పంట విక్రయించి రెండునెలలు దాటినా డబ్బులు ఖాతాల్లో జమకాలేదు. ఎప్పుడు పడతాయో కూడా అధికారులు చెప్పడం లేదు. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు బోనస్ వస్తేనన్న పెట్టుబడులు తీరుతాయని రైతన్నలు పెట్టుకున్న ఆశలపై సీఎం రేవంత్‌రెడ్డి నీళ్లు చల్లారు. బోనస్, ధాన్యం డబ్బుల కోసం అన్నదాతలు నిత్యం బ్యాంకుల చుట్టూ తిరగలేక ఏడుస్తున్నారు. ఈ మాటల ప్రభుత్వాన్ని నమ్మి నిలువునా మోసపోయామని కర్షకులు కోపంతో రగిలిపోతున్నారు. - నమస్తే నెట్‌వర్క్**

### ప్రభుత్వంపై నమ్మకం పోయింది..



కాంగ్రెస్ ప్రభుత్వంలో మాటలు తప్ప చేతలు లేవు. రైతులు సన్న ధాన్యం పండిస్తే క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని చెప్పి నేటి వరకు అందించలేదు. మొదట్లో ధాన్యం విక్రయించిన అందరు రైతుల ఖాతాల్లో డబ్బులు వేశామని గొప్పలు చెప్పి సంబురాలు చేశారు. కానీ.. మళ్లీ ఇవ్వలేదు. బోనస్‌కు సంబంధించిన ఒక్క రూపాయి కూడా పడలేదు. ఎవరిని అడగాలో.. ఎవరు సమాధానం చెబుతారో అనేది స్పష్టత లేదు. రైతులకైతే ఈ ప్రభుత్వంపై అస్సలు నమ్మకం లేదు.

**–బండి రమేశ్, యువ రైతు, తాళ్లపెంట, పెనుబల్లి మండలం**

### 113 క్వింటాళ్లు అమ్మినా బోనస్ రాలే..



113 క్వింటాళ్ల సన్న ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించాను. రెండు నెలలకు పైగా అవుతున్నా ఇప్పటివరకు నా ఖాతాలో డబ్బులు జమ కాలేదు. బోనస్ ఇస్తే వరి సాగు చేసినందుకు గిట్టుబాటు అవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి మాటలు నమ్మి పంట వేశాను. అధికారులను అడిగితే వస్తాయని చెబుతున్నారే తప్ప ఎప్పుడు వేస్తారని కచ్చితంగా చెప్పడం లేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

**– లక్ష్మీనర్సమ్మ, మహిళా రైతు, మందలపల్లి, దమ్మపేట మండలం**

